క్లుప్తంగా

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు



ఉమామహేశ్వర స్వామి

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని టోల్ గేట్ సమీప శ్రీ రామలింగేశ్వర దేవస్థానం, జేపీ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్యనగర్ కాలనీలోని మహాదేవుని ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఆదివారం తెలిపారు. రామలింగేశ్వర దేవస్థానంలో 108 కలశాలతో పూజ తోపాటు, అన్నదానం నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకుడు మహేష్ చెప్పారు. జేపీ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో భస్మాభిషేకం జరుగుతుందన్నారు.

భద్రకాళీ సమేత వీరభద్ర స్వామికి పూజలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలోగల భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో శ్రావణ మాసం ఆదివారం స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకం, భద్రకాళీ అమ్మవారి సన్నిధిలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. ఆలయ ఈఓ శశిధర్, నిర్వాహకుడు సోమయ్య ఆధ్వర్యంలో భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.

నేత్రపర్వంగా అయ్యప్ప మహాపడిపూజ



మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మై హోమ్స్ అంకురాలో ఆదివారం రాఘవేంద్రరావు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లెపల్లి సోమిరెడ్డి, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, స్థానిక నాయకులు మల్లారెడ్డి, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలతో జైపాల్‌రెడ్డి తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి సూచించారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో అమలవుతున్న మహిళల ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణాన్ని ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మహిళలతో మాట్లాడి పథకం అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మనూరు మండలం ఎల్గోయికి చెందిన సోనూబాయికి రూ.49 వేలు, వరుణ్ కుమార్‌కు రూ.23,500 ఆర్థిక సహాయం మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబీకులకు ఆదివారం ఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే అందజేశారు. మనూరు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు విఠల్‌రావు పాల్గొన్నారు. నిజాంపేటలో ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న అయ్యప్పస్వామి సామూహిక మహాపడి పూజ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని ఆహ్వానించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశాలు

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రాథోడ్ మోతీబాయి అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశానికి నూతన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ సంజీవరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలన్నారు.

మనూరులో..

మనూరు మండల సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ షాజిలొద్దీన్ ఆదివారం తెలిపారు. సమావేశం ఎంపీపీ కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలన్నారు.

మళ్లీ ఓటరు జాబితా సవరణ

ఎన్నికల సంఘం ఆదేశాలు
- 20వ తేదీ నుంచి సవరణకు చర్యలు
- 2024 ఫిబ్రవరి 8న తుది జాబితా
- అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచన



నారాయణఖేడ్: ఆగస్టులో ప్రత్యేక ఓటరు నమోదులో దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీఓ వెంకటేష్, అధికారులు (ఫైల్)

నారాయణఖేడ్: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ– 2024కు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించిన ప్రణాళికను ఇటీవలే ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఏటా ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటిస్తోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలుమార్లు సవరణకు అవకాశం ఇచ్చింది. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన సంఘం అక్టోబరులో తుది జాబితా ప్రకటించగా నవంబర్ రెండో వారంలో అనుసంధానం జాబితా ఇచ్చింది. ఆ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించింది. వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఓటరు జాబితా సవరణకు ఎన్నిక సంఘం తాజాగా ప్రణాళిక విడుదల చేసింది.

సవరణకు ఏర్పాట్లు

జాబితా సవరణ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 20వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా సవరణ చేపట్టనున్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) మళ్లీ ఇంటింటికి తిరిగి కొత్త దరఖాస్తులతో పాటు సవరణలుంటే వివరాలు సేకరిస్తారు. ఈ ప్రక్రియ 2024 జనవరి 5 వరకు ఉంటుంది. చివరగా జనవరి 6న ముసాయిదా జాబితాను ప్రకటించనున్నారు. అదేనెల 22వ తేదీ వరకు ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరిస్తారు. బీఎల్వోలు మరోసారి సర్వే చేపట్టి పరిష్కరిస్తారు. 2024 ఫిబ్రవరి 2న జాబితా పరిశీలించి అదేనెల 8న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు.

18ఏళ్లు నిండిన వారు అర్హులు

ఓటరు జాబితాలో పేరులేని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండిన వారు అర్హులుగా ఎన్నికల సంఘం పేర్కొంది. సీఈఓ వెబ్‌సైట్‌లోగానీ లేదా ఆఫ్‌లైన్‌లోగానీ, స్థానికంగా ఉండే బీఎల్వో వద్ద ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిబ్రవరిలో ఇచ్చే తుది జాబితాలో పేరుంటే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. దీంతో పాటు ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్ల నిండనున్న వారు సైతం ఓటు కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. జాబితా తయారీలో భాగంగా పోలింగ్ బూత్‌స్థాయిలో శని, ఆదివారాల్లో ప్రత్యేకంగా నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జనవరిలో ఇది ఉండగా ఎన్నికల సంఘం త్వరలో తేదీలను ప్రకటించే అవకాశం ఉంది. ఆరోజుల్లో స్థానికంగా ఉండేవారు, కొత్తగా నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం దరఖాస్తులను బీఎల్‌ఓలకు అందజేయాల్సి ఉంటుంది.

జిల్లాలో ప్రస్తుతం ఓటరు జాబితా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
నారాయణఖేడ్	1,16,581	1,14,599	8	2,31,188
అందోల్	1,22,699	1,26,543	6	2,49,248
జహీరాబాద్	1,36,523	1,34,259	3	2,70,785
సంగారెడ్డి	1,21,636	1,23,582	35	2,45,253
పటాన్‌చెరు	2,05,045	1,92,116	76	3,97,237

చర్యలు చేపట్టాం



ఓటరు జాబితా సవరణకు చర్యలు చేపట్టాం. ఓటరు జాబితాలో పేర్లు లేని వారు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్, బీఎల్వోల వద్ద నమోదు చేసుకొనేందుకు అవకాశం ఉంది. జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు కూడా దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం ఉంది. 18 ఏళ్లు నిండాకే జాబితాలో పేరు వస్తుంది.

– వెంకటేష్, ఆర్డీఓ, నారాయణఖేడ్

ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు ప్రణీత్ పనోరమ కాలనీలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతీ ఇంటికి మంచినీరు అందించాలన్న లక్ష్యంతో రూ.100 కోట్లతో ఇప్పటికే ఐదు రిజర్వాయర్లను నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సర్పంచ్ కృష్ణ, వార్డు కౌన్సిలర్లు చంద్రకళ, కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వర్టులేక ఇబ్బందులు



మామిడిపల్లి - తుంకిల్ల తండాకు వెళ్లేదారిలో పారుతున్న నీరు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని మామిడిపల్లి నుంచి తుంకిల్ల తండా, గొల్లగుడ తండాకు వెళ్లేదారిలో కల్వర్టు లేక ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చేనీరు రోడ్డుపై పారుతోంది. వర్షా కాలంలో ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పొలాలకు వెళ్ల లేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. రహదారిపై కల్వర్టు నిర్మించాలని మొరపెట్టుకున్నా ఫలితం లేకుండపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బోరు ఏర్పాటుకు జెడ్పీ నిధులు



శంకుస్థాపన చేస్తున్న నాయకులు, ప్రజా ప్రతినిధులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ప్రజా ప్రతినిధులు, నాయకులు సలీం, భాస్కర్, రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని హద్నూర్ గ్రామ సమీపంలోగల బీరప్ప స్వామి ఆలయం ఆవరణలో బోరు ఏర్పాటుకు జిల్లా పరిషత్ నిధులు కేటాయించారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు బోరు పనులను ప్రారంభించారు. ఆలయం ఆవరణలో నీటి సౌకర్యం లేకపోవడంతో ఆలయానికి వచ్చే భక్తులు తాగునీటి కోసం ఇబ్బంది పడేవారు. బోరు బావి కోసం నిధులు మంజూరు చేయాలని నాయకులు జెడ్పీటీసీ సభ్యురాలు స్వప్నను కోరారు. అందుకు స్పందించి జెడ్పీ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారు.

18 నుంచి మల్లన్న జాతర



ఏర్పాట్లపై గ్రామ పెద్దలతో చర్చిస్తున్న సర్పంచ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గి గ్రామంలో ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించే మల్లన్న జాతరను విజయవంతం చేసేందుకు గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ మారుతి యాదవ్ కోరారు. జాతరను పురస్కరించుకొని ఆదివారం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరను వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు. జాతరకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో గ్రామ పెద్దలు శ్రీపతి, రాజు, సిద్దారెడ్డి, భీమన్న, మొగులప్ప, విఠల్, మల్‌రెడ్డి పాల్గొన్నారు.

టోర్నమెంట్‌లతో క్రీడా ప్రతిభ వెలుగులోకి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

జహీరాబాద్: టోర్నమెంట్‌లు క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు వేదికలుగా ఉపయోగపడతాయని చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ అన్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలంలోని మిర్జంపల్లి తండాలో సేవాలాల్ మరియమ్మ మాత క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొనడం సంతోషకరమన్నారు. సర్పంచ్ బానోతు గోపాల్ మాట్లాడుతూ విజేత జట్టుకు రూ.25,111, రన్నర్ జట్టుకు రూ.15,111 నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చందర్ పాల్గొన్నారు.

నేటి నుంచి అఖండ హరినామ సప్తాహం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లోని శ్రీకల్పన ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలతోపాటు అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. సోమవారం సహస్ర దీపోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

మహిళలతో ఆర్టీసీ బస్సులు కిటకిట



న్యాల్‌కల్ నుంచి జహీరాబాద్ వెళ్తున్న బస్సును ఎక్కేందుకు క్యూ కట్టిన మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆర్టీసీ బస్సులు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకానికి మంచి స్పందన లభిస్తోంది. మహాలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం శనివారం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆదివారం మహిళలు ఆధార్ కార్డులతో బస్టాప్‌లకు చేరుకున్నారు. వాటిని చూపించి బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారు. నారాయణఖేడ్ నుంచి జహీరాబాద్ వెళ్లే బస్సులు మహిళలతో కిటకిటలాడాయి. ఉచిత ప్రయాణంతో మహిళల్లో సంతోషం కనిపించింది.

వసతులు లేక.. పట్టించుకోక

కేతకీలో నిరుపయోగంగా టూరిజం కాంప్లెక్స్



నిరుపయోగంగా ఉన్న టూరిజం భవనాలు



తలుపు లేని గది

ఝరాసంగం(జహీరాబాద్): భక్తులు, టూరిస్టుల సౌకర్యార్థం నిర్మించిన టూరిజం భవన సముదాయం నిరుపయోగంగా మారింది. ఝరాసంగంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయానికి వచ్చే భక్తులకు, పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు. అన్ని హంగులతో నిర్మించినా ఇది వినియోగంలో రాలేదు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకునే దశలో ఉంది. కేతకీ ఆలయానికి తెలుగు రాష్ట్రాలు సహా కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. అందుకు ఒక రోజు ముందుగానే ఆలయానికి చేరుకుంటారు. భక్తులకు తగిన వసతి లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కేతకీ సంగమేశ్వర ఆలయ ఆవరణలో భవన సముదాయాన్ని నిర్మించింది. 2011లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని వసతులతో కూడిన పది గదులను ప్రారంభించింది. ప్రారంభంలో కొన్ని నెలల పాటు భక్తులకు సేవలు అందాయి. తర్వాత సముదాయం నిర్వహణను కేతకీ ఆలయ అధికారులకు టూరిజం శాఖాధికారులు కొన్ని సంవత్సరాలపాటు అప్పగించారు. ప్రస్తుతం టూరిజం శాఖ పరిధిలో ఉన్నట్లు సమాచారం. వారి నిర్వహణ లోపంతో గదుల తలుపులు పూర్తిగా విరిగిపోయి గదులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. ఇందులో కీటకాలు, విషపురుగులు సైతం సంచరిస్తున్నాయి. ఇవి నిరుపయోగంగా ఉన్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నా. కొన్ని నెలల క్రితం టూరిజం శాఖ అధికారులు భవన సముదాయాన్ని పరిశీలించి, అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని భవన సముదాయాన్ని అభివృద్ధి చేయాలని, వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

టూరిజం శాఖకు అప్పగించాం



కొన్ని రోజులుగా కేతకీ పరిధిలో ఉన్న టూరిజం భవన సముదాయాన్ని టూరిజం శాఖ అధికారులకు అప్పగించాం. ప్రస్తుతం ఆలయ పరిధిలో లేదు. ఈ ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– శశిధర్, కేతకీ ఆలయ ఈఓ, ఝరాసంగం

13న నియోజకవర్గ స్థాయి సమీక్ష

పటాన్‌చెరు టౌన్: ఈనెల 13వ తేదీన పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్ష ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంలో అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి చేపడుతున్న పనుల పురోగతి నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి పనుల రూపకల్పనపై అన్ని విభాగాల అధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరినీ అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

సంస్థానంలో గోపాల కాల్వ

మునిపల్లి(అందోల్): జీవన్ముక్త సంస్థానం పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి సంస్థానంలో భక్తులు గోపాల కాల్వ కార్యక్రమాన్ని జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం మండలంలోని అంతారం జీవన్ముక్త సంస్థానంలో నాల్గవ రోజు ఉత్సవ కార్యక్రమం జరిగింది. అంతకు ముందు పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులతో పాటు జీవన్ముక్త మహారాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శంకర్, గ్రామ పెద్దలు, ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



పూజ చేస్తున్న భక్తులు

జహీరాబాద్: పట్టణంలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, తులసి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలలో భాగంగా స్వామివారికి రుద్రాభిషేకం, తులసి కల్యాణం, సత్యనారాయణ వ్రతం, దీపోత్సవం, దీప దానంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

ప్రతిభచాటిన విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): కుంగ్ ఫూ కరాటే సౌత్ ఇండియా చాంపియన్స్‌గా మండలంలోని మిర్జాపల్లి జెడ్పీపాఠశాల విద్యార్థులు నిలిచారు. ఆదివారం శంషాబాద్‌లో జరిగిన కుంగ్‌ఫూ కరాటే చాంపియన్ 2023 పోటీల్లో ముగ్గురు విద్యార్థులు రాణించారు. ప్రథమ స్థానంలో అంజలి పాండే, ద్వితీయ స్థానంలో ప్రసన్న, తృతీయ స్థానంలో రేణుక నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను కరాటే మాస్టర్ కిషన్‌స్వామిలను మిర్జాపల్లి జెడ్పీపాఠశాల హెచ్‌ఎం పుష్పవేణి అభినందించారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులు